వరదలు సమీపించే తరుణంలో నిర్వాసితులకు పునరావాసం పరిహారం అందించాలి : సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-ఎటపాక : జూలై ఆగస్టు సెప్టెంబర్‌లో గోదావరి వరదలు సమీపించేలో పునరావాసం పరిహారం అందించాలనీ సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ (నాని) డిమాండ్ చేశారు. బుధవారం ఎటపాక మండలంలోని గన్నవరం లోసీపీఐ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వరదలు సంభవించే సమయం కావడంతో వరదల ముంపు బాధితులకు ముందుగానే పోలవరం పరిహారం అందించి పునరావాసం కల్పించాలన్నారు. అంతేకాకుండా వరద ముంపులో గురికాకముందే నిర్వాసితులకు టర్పలిన్‌లు, కొవ్వొత్తులు, బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయాలన్నారు. ముంపులో ఉన్నవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నాటు పడవలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ ఏటా బ్యాక్ వాటర్ ప్రభావంతో ముంపునకు గురవుతున్న వారిని ముందుగానే పునరావాసం కల్పించి. పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి కందుకూరి స్వర్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విష్ణుమూర్తి, సీపీఐ డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము, సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, ఎంపిటిసి కంటే రాజు, మాజీ ఎంపిటిసి ముత్తయ్య, గద్దం వెంకటేశ్ పాల్గోన్నారు.

జాతరలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు : కలెక్టర్ విజయ సునీత

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఈనెల 9 నుండి 11వ తేదీ వరకు జరిగిన శ్రీమొదకొండమ్మ అమ్మవారి జాతరలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత ధన్యవాదాలు తెలిపారు. అందరి సమిష్టి కృషితో అమ్మవారి జాతర నిర్విఘ్నంగా, ప్రశాంతంగా నిర్వహించామని అభినందించారు. జేసి భావన వసిష్ట్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి. అభిషేక్, సబ్ కలెక్టర్ ధాత్రి రెడ్డి తమ వంతు సహకారం అందించారని ముఖ్యంగా సబ్ కలెక్టర్ ఆ మూడు రోజులు రక్తదాన శిభిరం ఏర్పాటు చేసి రక్తం సేకరించారని అభినందించారు. పారిశుధ్య కార్మికులు ఎప్పటికప్పుడు ఆలయ ప్రాంగణం, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంలో శక్తి వంచన లేకుండా కృషి చేసారని, పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రత కల్పించి ఉత్సవాలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతి భద్రతలు కాపాడారని కొనియాడారు. అదేవిధంగా ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ బృందాలు ఉత్సాహంగా పనిచేసి అమ్మవారి దర్శనం ప్రతిఒక్కరికీ లభించేలా చర్యలు తీసుకున్నా రని, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకునే విధంగా నిర్వహించారని, బ్రహ్మ కుమారీస్ పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా భక్తులకు సేవలు అందించారని సంతోషాన్ని వ్యక్తపరిచారు. మీడియా ప్రతినిధులు ప్రతి అంశాన్ని కవర్ చేసి అందరి ప్రశంసలు పొందారని, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక వైద్య శిభిరాలు ఏర్పాటుచేసి భక్తుల మన్ననలు పొందారని అభినందించారు. జిల్లాలోని ప్రతి శాఖా వారికి అప్పగించిన విధులను అంకిత భావంతో నిర్వహించారని, ఆర్టీసి అధికారులు ప్రత్యేక బస్సులు నడిపి అత్యధికంగా భక్తులు అమ్మవారి గుడికి చేరుకోవడంలో సహకరించారని వారందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాని కలెక్టర్ ప్రకటించారు.

ఉన్నత చదువులతోనే సమాజం అభివృద్ధి

- సూపర్ 50 విద్యార్థులకు సన్మానం
- గిరిపుత్రులకు నగదు బహుమతి
- ఐటిడి ఏపిఓ వి.అభిషేక్

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఉన్నత చదువులతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని ఐటిడి ఏ పి.ఓ. వి. అభిషేక్ స్పష్టం చేసారు.గిరిజన విద్యార్థులు గిరి శిఖరం అంత ఎత్తుకు ఎదగాలని ఆకాంక్షించారు. ఐటిడి ఏ అధ్వర్యంలో చదువే వెలుగు సూపర్ 50 లో ర్యాంకులు సాధించిన పది విద్యార్థులకు బుధవారం ఐటిడిఏ సమావేశ మందిరంలో 50 మంది విద్యార్థినీ విద్యార్థులకు నగదు బహుమతులు అందించి సత్కరించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రత్యేక బోధనను సద్వినియోగం చేసుకుని 50 మంది విద్యార్థులు మంచి మార్కులు సాధించడంతో నాకల నెర వేరిందని తనే స్వయంగా పది రాసి మంచి మార్కులు సాధించినంత అనుభూతి చెందానని సంతోషం వ్యక్తం చేసారు. రాష్ట్రంలోనే పాడేరు ఐటిడిఏ పరిధిలోని విద్యార్థులు మంచి మార్కులను సాధించారని చెప్పారు. కష్టాలు ఉన్నాయని ఇక్కడితో వెనుతిరగకుండా ఇంటర్ డిగ్రీలో ఉన్నతంగా చదువుకోవాలని సూచించారు. 25 ఏళ్ల వయస్సు వరకు కష్టపడి చదివితే 60 ఏళ్లు సుఖపడతారన్నారు. ప్రకృతి అన్నింటిని సిద్ధం చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయుల కృషివలనే విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని అన్నారు. సూపర్ 50 ని కొనసాగిస్తామని చెప్పారు. గిరిజన విద్యార్థులకు తగిన విధంగా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. గుత్తులపుట్టు ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొంది బాలికలు 30 మందిలో 23 మంది బాలికలు, దిగు మోదాపుట్టు ఆశ్రమ పాఠశాలలో శిక్షణ పొందిన 20 మంది బాలురులో 13మంది విశాఖపట్నం మారిక వలస కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్సులో ఇంటర్మీడియట్‌లో చేరారని, మిగిలిన విద్యార్థులు పాలిటెక్నికల్ కళాశాలలో ప్రవేశం పొందారని చెప్పారు.

విద్యార్థులకు నగదు బహుమతులు : యాభై మంది విద్యార్థుల్లో పది పరీక్షల్లో 585 మార్కులు సాధించిన కిల్లో ధార మణికి రూ.20 వేలు, 566 మార్కు పొందిన తిరుపతికి రూ.15 వేలు, 561 మార్కులు సాధించిన టి. హరిలాల్ ప్రసాద్ కు రూ. 10 వేలు నగదు బహుమతిని, మిగిలిన 47 మంది విద్యార్థినీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.2,500లు చొప్పున నగదు బహుమతిని, మెమెంటోలను అందజేసారు. విద్యార్థులు ఉన్నత మార్కులు సాధించడానికి కృషి చేసి ఉత్తమ విద్యను అందించిన ఉపాధ్యాయులను సాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐటిడి ఏసహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ.కొండలరావు ఎటిడబ్ల్యూఓలు ఎల్.రజని, వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు టి. నాగేశ్వరరావు, జి.వి.వి.ప్రసాద్, ఎస్. సింహాచలం, ఆర్.ధర్మన్న, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తలిదండ్రులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి, మంత్రులుగా ప్రమాణ స్వీకారం కార్యక్రమాన్ని కలెక్టరేట్ నుంచి లైవ్ స్ట్రీమింగ్‌లో వీక్షిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జెసి భావన వశిష్ఠ్, డిఆర్ఓ బి.పద్మావతి

కూనవరం సీపీఐ మండల కన్వీనర్‌గా లంబు

విశాలాంధ్ర-కూనవరం : సిపిఐ పార్టీ నూతన మండల కన్వీనర్ గా సీనియర్ నాయకులు జిల్లా రైతు సంఘం నాయకులు కామ్రేడ్ లంబు శ్రీనివాసరావును, సహాయ కన్వీనర్ గా సోడే కన్నారావును బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కూనవరంలోని సిపిఐ కార్యాలయంలో బుధవారం జరిగిన నాలుగు విలీన మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ జిల్లా కౌన్సిల్ సభ్యులు కందుకూరి స్వర్ణ డివిజన్ కార్యదర్శి గుజ్జ మోహన్ రావు సహాయ కార్యదర్శి వాసం రాము సమక్షంలో పార్టీ కార్యకర్తలు అందరూ ఏకగ్రీవంగా వీరిద్దరిని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా లంబు శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ తనకు అప్పజెప్పిన బాధ్యతకు కృషివంచన లేకుండా పనిచేస్తానని పార్టీ పునర్నిర్మాణానికి కార్యకర్తల అందరి సహకారం కావాలని అన్నారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల ప్రజా సంఘాల నాయకులు మండల కార్యదర్శిలు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ కూటమి నేతల సంబరాలు

విశాలాంధ్ర-జీకే వీధి : నాలుగోసారి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న నారా చంద్రబాబు నాయుదు అలాగే రాష్ట్ర మంత్రి గా ప్రమాణ స్వీకారం చేస్తున్న జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన గుమ్మడి సంధ్యారాణి అభినందనలు తెలుపుతూ జికె వీధి మండలంలో బిజెపి టిడిపి జనసేన నాయకులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ మండల అధ్యక్షులు కొయ్యం బాలు బిజెపి పార్టీ మండల అధ్యక్షులు వలపల జోగిరాజు టిడిపి మండల అధ్యక్షులు ముక్కల రమేష్ ఎంపీటీసీ. రీమాల రాజేశ్వరి. వివిధ పార్టీల నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. టిడిపి రాష్ట్ర ఎస్టీ సెల్ ఆర్గనైజేషన్ సెక్రెటరీ కొర్ర బలరం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి మండలంలో ఎన్‌డిఏ కూటమి నాయకులు హాజరయ్యారు. కోర్ర బలరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సర్వ నాశనం చేసిన జగన్ ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో రాష్ట్రంలో కూటమి నాయకులు. కార్యకర్తలు పడిన కష్టానికి ఫలితం దక్కిందని గిరిజన ప్రాంతంలో జీవో నెంబర్ 3 రద్దయి గిరిజన ప్రాంతం అభివృద్ధికి దూరంగా నష్టపోయి ఉందని ఈ కొత్త ప్రభుత్వం గిరిజన ప్రాంతానికి న్యాయం చేస్తుందని అరకు సభలో చంద్రబాబునాయుదు ఇచ్చిన హామీలు గుర్తు చేశారు. జికె వీధి మండలం పూర్తిగా అభివృద్ధిలో వెనుకబడిన మండలంగా ఇప్పటికీ ఉందని రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ ఇన్చార్జిలను. మండల ఇన్చార్జిలను నియమించిన తర్వాత జీకే వీధి మండలం అభివృద్ధి పథంలో నదుస్తుందని వివిధ పంచాయతీల నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్య క్రమంలో కూటమి మండల ప్రెసిడెంట్లు. వనపల జోగిరాజు కోయ్యం బాలరాజు, జిల్లాలల నాయకులు. బొండ్ల చిరంజీవి. ముక్కలు మహేష్, కాకూరి శేఖర్, మత్స్య రాస రాంకిరణ్‌లకే రాము. మొట్టడం లక్ష్మణ్. జనసేన పార్టీ మండలం ఉపాధ్యక్షులు బత్తుల సిద్ధార్థ మార్క్, గదుతూరి పరమేశ్వరరావు, పుత్తూరు విష్ణుమూర్తి శ్రీరాములు, పాండురాజు, పంపు నూకరాజు, పోతురాజు రాంబాబు, మొట్టడం రాజబాబు, మామిడి బాలయ్య, వండలం బాలయ్య, వన్నురంగి దుర్గ గంగరాజు, కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

అనంతగిరి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుదు ప్రమాణ స్వీకారం సందర్భంగా అనంతగిరి మండల పరిషత్ కార్యాలయంలో, ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని టెలికాస్ట్ చేయడంతో మండల తెలుగుదేశం పార్టీ, అలాగే జనసేన బిజెపి పార్టీ కార్యకర్తలు నాయకులందరూ కార్యక్రమాన్ని వీక్షించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు బుజ్జిబాబు, ఆనంద్, జోగులు, మొస్య రంజిత్, శ్యామ్, అర్జున్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు చిట్టం మురళి, రత్న ప్రియతోపాటు ఆయా పార్టీ నాయకులు ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

136 మంది విద్యార్థులకు ఏకలవ్యలో ప్రవేశం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : ఐటిడి ఏ పరిధిలోని ఏకలవ్య కళాశాలలో 136 మంది ద్యార్థులకు ప్రవేశం కల్పించామని ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ తెలిపారు. ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థుకు బుధవారం స్థానికి ఎపి ఆర్ కళాశాలలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటిడి ఏ ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ 85 మంది బాలురకు, 51 మంది బాలికలకు ఏకలవ్య కళాశాలలో ప్రవేశాలకు కౌన్సిలింగ్ నిర్వహించి ఇంటర్మీడియట్ గ్రూపులలో ప్రవేశం కల్పించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ. కొండలరావు, ప్రిన్సిపాల్స్ ఎం.వి. రమణారావు, పి.ఎస్.ఎన్.మూర్తి, వై.పారయ్య తదితరులు పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ ప్రారంభం

విశాలాంధ్ర-బెలగాం : పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన స్టూడెంట్ కిట్లను మండలం, మున్సిపల్ పాఠశాలలకు పంపిణీ చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి 1 సామల సింహాచలం తెలిపారు. ప్రస్తుతం మండల కేంద్రానికి చేరినటువంటి పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, స్కూల్ బ్యాగ్లు తదితర వస్తువులతో కూడిన స్టూడెంట్ కిట్లను స్థానిక ఎంఈఓ కార్యాలయం నుండి ఎంఈఓ 2 కె. ప్రసాదరావు పర్యవేక్షణలో సిఆర్ఎంటిలు, పిటిఐల ద్వారా ఆయా పాఠశాలల పాయింట్ వద్దకు చేరవేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల యూనిఫామ్స్ ఇంకా రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే వాటిని కూడా నేరుగా పాఠశాలలకు అంద చేయడం జరుగుతుందన్నారు.

నేటి నుండి పాఠశాలలు పున ప్రారంభం

విశాలాంధ్ర-సీతానగరం : జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలన్నీ వేసవి సెలవులు అనంతరం నేటి నుండి పునః ప్రారంభం జరగనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కిట్లను పర్యవేక్షణ నిమిత్తం విచ్చేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు అన్ని రకాల యాజమాన్యాల పరిధిలో ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు నిర్ణీత సమయానికి తెరవాలన్నారు. ఇదిలా ఉండగా1వ తరగతినుండి 10వతరగతి వరకుప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు కిట్స్ పంపిణీ జరుగుతుందన్నారు. నేడు పాఠశాలలో ప్రారంభ సమయానికి ప్రతి విద్యార్థికి కిట్స్ అందజేయాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.ఈమండలంలోకిట్స్ ను పాఠశాలలకు త్వరితగతిన పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు నేడు ప్రారంభించే సమయంలోగా అన్ని పాఠశాలలకు కిట్స్ చేరిపోవాలని, ఏఒక్కవిద్యార్థి కూడా తనకు కిట్ అందలేదని ఫిర్యాదు రాకూడదని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ-1 సూరిదేముడు, ఎంఈఓ-2 మువ్వల వెంకటరమణ, ఉన్నత పాఠశాల హెచ్ ఎం ఇల్లా ప్రసన్న లక్ష్మి,ఏపిఓ జగదీశ్, సిఆర్పిలు అనసూయ, గణేష్ ,దామోదర్ రావు,రమేష్, ఆఫీసు సిబ్బంది గణపతి,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడి స్క్రీన్‌లో సీఎం చంద్రబాబు ప్రమాణ స్వీకార వీక్షణ

విశాలాంధ్ర-సీతానగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుదు, మంత్రిమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వీక్షించేందుకు మండలం లోని పెదభోగిల, నిడగల్లు, తామరఖండి, అంటిపేట గ్రామ సచివాలయాల్లో ఎల్ఈడి స్క్రీన్లుఏర్పాటు చేసారు. టిడిపి, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల ఎన్డీఏ ప్రభుత్వ ప్రమాణ స్వీకారం ప్రజలు ఉద్యోగులు వీక్షించేలా తగు చర్యలుతీసుకోవాలని కలెక్టర్ ఆదేశాలమేరకు ఎంపీడీఓ ఈశ్వరరావు ఆధ్వర్యంలో సచివాలయ కార్యదర్శులు ఏర్పాటు చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, టిడిపి, జనసేన, బీజేపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి వీక్షించారు.

ప్రజా సమస్యలపై పవన్ కళ్యాణ్ స్పందన అభినందనీయం

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : గతంలో పార్వతీపురం నియోజకవర్గ పరిసర ప్రాంతాలలో నెలకొన్న సమస్యలపై మంగళగిరిలో జనసేన పార్టీ ఆఫీసులో జనసేన అధ్యక్షులు కొణిదల పవన్ కళ్యాణ్ ని కలవడం జరిగిందనీ ఈ సమస్యలను పరిష్కారం చేయడం జరుగుతుందని పవన్ కళ్యాణ్ స్పందించి హామీ ఇవ్వడం హర్షణీయమని జాతీయ మానవ హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు వలిరెడ్డి జగదీష్ అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మన్యం జిల్లాలో ఉన్న ప్రధానమైన సమస్యలు, తాగునీరు సాగునీరు,ఉపాధి కల్పన, ఏనుగుల సమస్య, జంఝావతి తోటపల్లి రిజర్వాయర్లు, జగనన్న కాలనీల సమస్యలను పరిష్కరించే విధంగా, ఆలోచన చేయండని కోరడం జరిగిందనీ అదృష్టం కొలది నిన్న జరిగిన ప్రెస్ మీట్ లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఈ విషయాలు ప్రస్తావించడం జరిగిందనీ,అందుకు చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యనారాయణ సర్వేశ్వరరావు ఉన్నారు.

ఫిజికల్ సైన్స్ డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పార్వతీపురం : మన్యంజిల్లా ఫిజికల్ సైన్స్ టీచింగ్ డైరీను జిల్లా విద్యాశాఖ అధికారి పగడాలమ్మ ఆవిష్కరించారు. ఫిజికల్ సైన్స్ డైరీ ని ఆవిష్కరించిన ఆమె మాట్లాడుతూ ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుల ఫోరం నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు సైన్స్‌పై ఉండే భయాందోళన తొలగించే చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా సైన్స్ అధికారి గిరడ లక్ష్మణరావు రూపకల్పన చేసిన ఈడైరీ 240పేజీలతో విన్నుత్నంగా తయారు చేశారు. అన్ని అంశాలు డైరీలో పొందుపరిచారు..ఈకార్యక్రమం లోజిల్లా సైన్స్ కోఆర్డినేటర్ పెంట రామకృష్ణ, ఏఎంఒ శ్రీనివాసరావు, ఏఎస్ ఓ రామకృష్ణ, ఏ పి ఓ హరిప్రసాద్, మన్యం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ సతీష్ రాజు, బెహరా సంతోష్, పెదప్రోలు శైలజ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రమంత్రిగా సంధ్యారాణి ప్రమాణ స్వీకారం...

విశాలాంధ్ర-సాలూరు రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రిగా సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఆమెతో ప్రమాణం చేయించారు. సంధ్యారాణి 1974 మార్చి 15వ తేదీన జన్మించారు. తండ్రి జన్ని ముత్యాలు (మాజీ ఎమ్మెల్యే) స్ఫూర్తితో 25 ఏళ్ల వయసులోనే రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1999 వ సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా సాలూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమి చెందారు. 1999-2006 వరకు సాలూరు నియోజకవర్గ కాగ్రెస్ పార్టీ ఇంఛార్జ్‌గా కొనసాగారు. 2005-07 మధ్య అంటే రెండేళ్ల పాటు ఉత్తరాంధ్ర మహిళా శిశు సంక్షేమ శాఖ రీజనల్ కో ఆర్డినేటర్‌గా పనిచేశారు. 2007-09 మధ్యలో యస్సీ,యస్టీ కమీషన్ సభ్యురాలిగా పనిచేశారు.ఆ తరువాత తెదేపాలో చేరి 2009లో జరిగిన శాసనసభ ఎన్నికలలో సాలూరు నియోజకవర్గ తెదేపా అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచి స్వల్పఓట్ల తేడాతో సమీప ప్రత్యర్థి రాజన్నదొర చేతిలో ఓటమి చెందారు. 2009 నుండి 2014 వరకు సాలూరు నియోజకవర్గ టిడిపి ఇంఛార్జ్‌గా పనిచేశారు. ఇంఛార్జ్‌గా సంధ్యారాణి వ్యవహరించిన కాలంలో మున్సిపల్ ఎన్నికలలో సాలూరు మున్సిపాలిటీని తెదేపా కైవసం చేసుకుంది. 2014 సార్వత్రిక ఎన్నికలలో అరుకు పార్లమెంటు నియోజకవర్గం నుండి తెదేపా తరుపున పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. 2015-21 మధ్య కాలంలో శాసనమండలి సభ్యురాలిగా (ఎమ్మెల్సీ) పనిచేశారు. 2021 నుండి నేటివరకు తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా ఉన్నారు. 2024లో జరిగిన ఎన్నికలలో కూటమి అభ్యర్థి గా ఎన్నికల బరిలో నిలిచి తమ సమీప ప్రత్యర్థి వైకాపా అభ్యర్థి రాజన్నదొర పై 13 వేలపై చిలుక ఓట్ల తేడాతో గెలుపొంది రాష్ట్ర మంత్రివర్గంలో చోటు సంపాదించారు. సంధ్యారాణి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం సీఎం చంద్రబాబునాయుదుని కలిసి కృతజ్ఞతలు తెలియజేసారు. సంధ్యారాణికి మంత్రి పదవి రావడంతో తెదేపా శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇరవై సంవత్సరాలగా నియోజకవర్గంలో నిర్జీవంగా ఉన్న తెదేపా పార్టీకి సంధ్యారాణి గెలుపుతో కొంత ఉత్సాహం వచ్చింది. ఇప్పుడు మంత్రివర్గంలో ఆమెకు స్థానం కేటాయించడంతో నియోజకవర్గంలో తెదేపాకు మంచి రోజులు వచ్చాయని కార్యకర్తలు ఆనందోత్సాహాలతో సంబరాలు జరుపుకుంటున్నారు.

మంత్రి సంధ్యారాణికి శుభాకాంక్షల వెల్లువ: రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకుని బుధవారం మంత్రిగా ప్రమాణం స్వీకారంచేసిన గుమ్మిడి సంధ్యారాణికి సాలూరు నియోజకవర్గ తెదేపట నాయకులు అమరావతిలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సాలూరు మండల తెదేపా అధ్యక్షుడు ఆముదాల పరమేష్ ఆధ్వర్యంలో మండల నాయకులు కరిబుగత భాస్కరరావు, ఎక్కుడు గణపతి,కృష్ణ తదితర నాయకులతోపాటు పట్టణానికి చెందిన సీనియర్ నాయకులు పప్పల మోహనరావు, కొణిసి వేణుగోపాల్(చిన్ని) తదితరులు కలసి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆముదాల పరమేష్ మాట్లాడుతూ సంధ్యారాణికి మంత్రి పదవి లభించడం వలన సాలూరు నియోజకవర్గంతో పాటు నూతనంగా ఏర్పాటు అయిన మన్యం జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. సంధ్యారాణికి మంత్రి పదవితో సాలూరులో తెదేపా గెలుపునకు కృషి చేసిన ప్రతీ కార్యకర్త కష్టానికి తగిన ఫలితం లభించిందన్నారు. పార్టీ అధినాయకుదు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని వారంతా తెలిపారు.

ఆడపిల్లను కాపాడుకుందాం

విశాలాంధ్ర-సాలూరు రూరల్ : పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం లో భాగంగా కళాజాత కార్యక్రమం బుధవారం మండలంలో తోణాం, నేరేళ్లవలస, కురుకూటి గ్రామాలలో నిర్వహించినట్లు ఐసిడియస్ సూపర్‌వైజర్లు ధనలక్ష్మి,విజయలక్ష్మీలు తెలిపారు. ఈ కళాజాత కార్యక్రమం లో బాలికల చదువు యొక్క ఆవశ్యకతను, బాల్యవివాహాల వలన కలిగే నష్టాలను వివరిస్తూ నాట్య ప్రదర్శన చేశారు.ఈ సందర్భంగా సూపర్‌వైజర్లు మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు శక్తివంతులని ఒకే సమయంలో విభిన్న పనులను సమర్ధవంతంగా చేయగల శక్తిసామర్థ్యాలు మహిళలకు ఉన్నాయన్నారు.కుటుంబంలో మహిళ చదువుకుంటే తన పిల్లలకు సమాజంపట్ల సరైన అవగాహన కల్పిస్తుందన్నారు. మహిళలకు సంబంధించిన చట్టాలపై వారు అవగాహన కల్పించారు. ఆడ, మగ తేడా చూపకుండా అన్ని రంగాలలో రాణించేలా బాలికలను తీర్చిదిద్దాలన్నారు. బాల్యవివాహాలను అరికట్టే బాధ్యత అందరిపై ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు మనవంతు కృషిచేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వెంకటేష్, రాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న జనసేన నాయకులు

విశాలాంధ్ర-బెలగాం : చంద్రబాబు నాయుదు, పవన్ కళ్యాణ్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఇరువురికి జనసైనికులు అభినందనలు తెలిపారు. అలాగే మొక్కులు చెల్లించుకున్నారు. జనసేన నాయకులు చందక అనిల్ ఆధ్వర్యంలో స్థానిక వినాయకుడి గుడి వద్ద టెంకాయ మొక్కులను జనసేన నాయకులు నెయ్యిగాపుల సురేష్, సిరిపురపు గౌరీ, బమ్మిడిపాటి చైతన్య, కడగల శ్యాంసుందర్, బార్నాల పవన్, రెడ్డి నాగరాజు, రేవళ్ల దుర్గాప్రసాద్, చింతాడ ముఖేష్, వహాబ్, యు. నాగరాజు, శంబాన రమేష్, నగేష్, గేదెల వంశీ, రౌతు బాలు, వినయ్, రాజ్ కుమార్, మేరువ శివకుమార్, కొల్లేపర తేజ, పండ సాయి తదితర జనసైనికులు మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బెలగాం జయప్రకాష్ నారాయణ, బార్నాల సీతారాం, మజ్జి వెంకటేష్, సిరిపురపు భాషా, శ్రీకాంత్, ఎడ్ల కామేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీకి చర్యలు

మండల విద్యాశాఖ అధికారి నాగభూషణరావు వెల్లడి



విశాలాంధ్ర-గరుగుబిల్లి : పాఠశాలలు గురువారం నుండి పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యా కానుక కిట్లుతో పాటు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేందుకు చర్యలు చేపదుతున్నామని మండల విద్యాశాఖ అధికారి నగిరెడ్డి నాగభూషణరావు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో విద్యాకానుక కిట్లుతో పాటు పాఠ్యపుస్తకాలను పంపిణీకి సిద్ధం చేయడం జరిగిందన్నారు. పాఠశాలలు ప్రారంభంరోజు అయిన గురువారం నుండి విద్యార్థులకు విద్యాకానుక కిట్లుతో పాటు పాఠ్య పుస్తకాలను అందజేయడం జరుగుతుందని ఈసందర్భంగా ఎం ఈ ఓ నాగభూషణరావు పేర్కొన్నారు. విద్యాకానుక కింద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, షూ , బెల్ట్, బ్యాగు, యూనిఫారంలను తదితర సామాగ్రితో కూడిన కిట్లును పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు.

ఐటిడిఏ పిఓకు ఘన సత్కారం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : గిరిజన విద్యార్థులు 10 పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించడానికి సూపర్ హిట్ సృష్టికర్త ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి వి అభిషేక్ ను ప్రధానోపాధ్యాయులు సాలువ కప్పి ఘనంగా సత్కరించారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో ప్రాజెక్టర్ వి అభిషేక్, గిరిజన సంక్షేమ శాఖ డిడి హాయ్ కొండలరావు, పలువురు ఏటిడబ్ల్యులను ప్రధానోపాధ్యాయులు సత్కరించారు.గత ఏడాది అక్టోబర్ ఆరో తేదీన117 గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల నుండి పాఠశాలకు ముగ్గురు చొప్పున ఎంపిక చేసి రాత పరీక్ష నిర్వహించి ఉత్తమ మార్కులు సాధించిన50 మంది విద్యార్థిని విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందించి ఉత్తమ మార్కులు సాధించడానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది ఇక మీదట సూపర్ 50ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంకండి : ఐటిడిఏ పిఓ గనోరే

విశాలాంధ్ర-రంపచోడవరం : ఏజెన్సీలోని జ్వరాలతో ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే రక్త నమూనాలు స్వీకరించి మలేరియా డెంగు వ్యాధులు ఉన్న రోగులను వెంటనే ఆసుపత్రిలో జాయిన్ చేసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గానోరే సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయపు సమావేశపు హాల్ నుండి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులతో, ఎంపీడీవోలతో, పిఓపిఆర్డిలతో, మలేరియా సబ్ యూనిట్ అధికారులతో, ఎంపీహెచ్వో లతో, ఏజెన్సీ డీఈవోతో, డివిజనల్ పంచాయతీ అధికారితో మండల విద్యాశాఖ అధికారులతో ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో అదేవిధంగా కొంతమంది అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ మరి కొంతమంది అధికారులతో సమావేశం మలేరియా నిర్మలపై ప్రాజెక్ట్ అధికారి నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గానోరే మాట్లాడుతూ అన్ని మండలాల పరిధిలో గల గ్రామాలలో మలేరియా దోమలు ప్రబలకుండా ఎక్కడికి అక్కడ ఫాగింగ్ చేయాలని ఆయన అన్నారు. అదేవిధంగా ప్రతి ఇంటిలో మలేరియా స్ప్రేయింగ్ చేయాలని ఆయన అన్నారు. ఏజెన్సీలోని ప్రతి ఆశ్రమ స్కూల్లో, ప్రతి ప్రభుత్వ స్కూళ్లలో మలేరియా స్ప్రింగ్, ఫాగింగ్ తప్పనిసరిగా చేయాలని ఆయన అన్నారు. ప్రతిరోజు ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్ని రక్త పరీక్షలు చేయుచున్నది అదేవిధంగా ఎంతమందికి మలేరియా అని నిర్ధారణ అవుతున్నది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా వైద్యాధికారులను ఆయన ఆరా తీశారు. ప్రతి గ్రామంలో మలేరియా స్ప్రేయింగ్ చేసింది లేనిది అదేవిధంగా ఫాగింగ్ చేసింది లేనిది ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారిగా ఆయన ఆరా తీశారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మలేరియా ప్రబలకుండా ఎక్కడికక్కడ తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది ఏఎన్ఎంలు ఉన్నది, ఎంతమంది ఆశ వర్కర్లు ఉన్నది ఆయన ఆరా తీశారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా, డెంగ్యూ వ్యాధికి సంబంధించిన మందులు అందుబాటులో పెట్టుకోవాలని ఆయన అన్నారు. ఏజెన్సీలోని ఆశ్రమం పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే తాగునీరు శాంపిల్స్ తీసుకొని నివేదికల సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. విద్యార్థులకు జ్వరము ఉంటే వెంటనే దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకొని వెళ్లి వైద్యం చేయించాలని ఆయన అన్నారు. ఆస్పత్రిలో క్లోరిన్ టాబ్లెట్లు ఉంటే వెంటనే సరఫరా చేయాలని ఆయన అన్నారు. ఫాగింగ్ కు సంబంధించిన మిషన్లు రిపేర్లు ఉన్న ఎడల వెంటనే రిపేర్ చేయించాలని ఆయన అన్నారు. ఏజెన్సీలోని అన్ని గ్రామాలలో ఈ వర్షాకాలంలో మలేరియా, డెంగు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులు ఆయా గ్రామాలలో పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించడం జరిగింది. ఈకార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి రఘు నందన్, గిరిజన సంక్షేమ శాఖ ఇన్చార్జి డిప్యూటీ డైరెక్టర్ తేజస్విని, ఎంపీడీవో హరికృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ డేవిడ్, ఏ టి డబ్ల్యూ ఓ రామ తులసి, మండల విద్యాశాఖ అధికారి యం. రామకృష్ణ, ఎంపిహెచ్ఓలు పీటర్, డేవిడ్, ఆర్డబ్ల్యూఎస్ డిఇ రాజేంద్రబాబు అన్ని మండలాలకు సంబంధించిన మండల విద్యాశాఖ అధికారులు, వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, పిఓపిఆర్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం పూర్తయింది

ఇక అధికారుల బదిలీలకు రంగం సిద్ధం

విశాలాంధ్ర-పార్వతీపురం : రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబు నాయుడు, మంత్రిమండలి ప్రమాణ స్వీకారం పూర్తికావడంతో జిల్లాలో కీలకమైన అధికారుల బదిలీకీ రంగంసిద్ధం చేస్తున్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన తర్వాత గతరెండేళ్లుగా కొనసాగుతున్న జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ బదిలీ మొదటి జాబితాలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆయనతోపాటు జిల్లా ఎస్పీ విక్రాంతపాటిల్, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్, ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ విష్ణుచరణ్ వంటి ఐఏఎస్ అధికారులు మొదట విడుదల బదిలీ కాగా, రెండో విడతలో పార్వతీపురం ఆర్డీవో కే హేమలత, పాలకొండ ఆర్డీవో వెంకటరమణ తదితర గ్రూపు 1అధికారులకు బదిలీలు తప్పవని స్పష్టంగా తెలుస్తోంది. దీనిపై ఇప్పటికే ముఖ్యమంత్రి కసరత్తు చేశారని, మంత్రులకు శాఖలు ప్రకటించడమే తరువాయి బదిలీలు జరుగుతాయని విశ్వసనీయ సమాచారం

పార్వతీపురం మన్యంజిల్లాపై రకరకాల ఊహాగానాలు : గతప్రభుత్వంలో జిల్లాల ఏర్పాటు పారదర్శకంగా జరగలేదని, దీనిపై చంద్రబాబునాయుడు పునరాలోచనచేసి మరిన్ని మార్పులు చేస్తారని విశ్వసనీయ సమాచారం. దీనిలో భాగంగానే పార్వతీపురం మన్యంజిల్లాను ఉమ్మడి జిల్లాలో కలిపివేసే చర్యలు కూడా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు, మేధావులు తెలియజేస్తున్నారు. లేదంటే రాష్ట్రంలోని 26జిల్లాలో మరికొన్ని చేర్పులు మార్పులు చేసి 25 జిల్లాలకు కుదించే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో పార్వతీపురం మన్యం జిల్లాను విజయనగరంజిల్లాలో కలిపివేసే చర్యలు ఉన్నట్లు రాజకీయవిశ్లేషకులు, మేధావులు,ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. పార్వతీపురం మన్యంజిల్లా వల్ల ఈప్రాంతానికి ఒరిగేదేమి లేదని పూర్వపు ఉమ్మడిజిల్లాయే ముద్దని ఈప్రాంతనాయకులు అనుకుంటున్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ రెవెన్యూ డివిజన్ ను శ్రీకాకుళం జిల్లాలోకలిపి, పార్వతీపురం రెవెన్యూ డివిజన్ ను విజయనగరంజిల్లాలో కలిపి వేసి ఉమ్మడిజిల్లాగా ఏర్పాటు చేయడమే ఉత్తమమని పలువురు చర్చించుకుంటున్నారు. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి మండలి ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటుందో వేచి చూడాలి మరి...

సచివాలయాల ఉద్యోగులో ఆందోళన : గతప్రభుత్వంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసి లక్షా 26వేలు ఉద్యోగాలు కల్పించగా, సచివాలయ ఉద్యోగుల్లో కూడా నేడు రకరకాల ఆందోళన కలుగుతుంది. సచివాలయాల్లో 11మంది ఉద్యోగులను నియమించగా వారంతా అప్పటవలే ఒకచోటే ఉంటారా... లేదంటే వివిధ శాఖలకు మల్లిస్తారా అని ప్రజలు చర్చించుకుంటున్నారు. సచివాలవ్యవస్థలో కేవలం ముగ్గురు లేదా ఐదుగురు ఉంటే సరిపోతుందని మిగిలిన వారిని వివిధ విభాగాలకు తరలించే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది. పంచాయతీరాజ్ చట్టప్రకారం వారిని ఆయామండల శాఖల అధికారులకు అప్పగించి వారి ఆధ్వర్యంలో పనిచేయించే అవకాశాలు ఉన్నాయని స్పష్టంగా కనిపిస్తుంది. సచివాలయ వ్యవస్థను పటిష్టవంతం చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రధాన లక్ష్యమని దీనిపై సచివాలయ ఉద్యోగులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికార పార్టీకి చెందిన నేతలు స్పష్టం చేస్తున్నారు. ఏదిఏమైనా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉద్యోగులకు అండగా ఉంటారని అందరికీ సముచిత ప్రాధాన్యత ఇస్తారని వేచిచూద్దాం మరి.

ఈఏపి సెట్‌లో ఆర్కే కాలేజీకి ర్యాంకుల పంట

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : పట్టణానికి చెందిన ఆర్కే జూనియర్ కళాశాలకు ఈఏపీ సెట్లో ర్యాంకుల పంట పండింది. బుధవారం ర్యాంకులు సాధించిన విద్యార్థులను మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం అభినందించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన అభినందన సభలో కళాశాల కరస్పాండెంట్ పూదు రామకృష్ణ మాట్లాడుతూ తమ కళాశాలలో ఎంపీసీ చదివిన విద్యార్థులు 10 వేల లోపు నాలుగు ర్యాంకులు, బైపీసీ చదివిన విద్యార్థులు 5 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీసీ విభాగంలో కే.కీర్తన 6490 ర్యాంకు, ఎం.నాగేశ్వరి 8736, ర్యాంకు పి.సాయి గణేష్ 9905 ర్యాంకు, సిహెచ్ తనూజ 10521 ర్యాంకులు సాధించారన్నారు. బైపీసీలో ఎం.హితశ్రీ 586, జి.అక్షయ 2454, డి.ప్రణతి 2950, వికే శ్రావణి 10095, జి.దివ్య 1938 ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన విద్యార్థుల అభినందన సభలో మండల విద్యాశాఖ అధికారి సామల సింహాచలం మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందుబాటులోకి తెచ్చిన ఆర్కే యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో చక్కగా స్థిరపడాలన్నారు .తోటి విద్యార్థులు అవకాశాలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రిన్సిపాల్ భూపాల్ తదితరులు ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను సన్మానించి అభినందించారు.

ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారం వీక్షించిన అధికారులు

విశాలాంధ్ర-కురుపాం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్. అప్పారావు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ను ప్రత్యేక ప్రసారం ద్వారా మండల అధికారులు సచివాలయ అధికారులు పాల్గొని వీక్షించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ ఎస్ వి ఎస్ సత్యనారాయణ , పంచాయతీ విస్తరణ అధికారి జి.రమేష్ బాబు, ఏపీవో పి.బావాజీ, మేజర్ పంచాయతీ ఈ ఓ కె. చంద్రశేఖర్ మండలంలో గల అన్ని సచివాలయాల సిబ్బంది వెలుగు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలం తహశీల్దార్,మండలం పరిషత్ కార్యాలయాలు విద్యుత్ దీపాలు తో అలంకరించి నూతన ప్రభుత్వం సంబరాలు జరుపుకున్నారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా మండలంలో గొటివాడ గ్రామంలో మాజీ సర్పంచ్ తిమ్మక సుందరరావు, మాజీ ఎంపీటీసీ దాలమ్మ ఆధ్వర్యంలో బుధవారం ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు సంబరాలు నిర్వహించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా, రైతు సంక్షేమం ఉండే సుపరిపాలన కేవలం చంద్రబాబుతోనే సాధ్యమని ఆయన పరిపాలనలో ప్రజలకు సుభిక్షమైన పాలన అందుతుందని అందుకే నాలుగోసారి చంద్రబాబుకే ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రోబ్బా లోవరాజు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తిమ్మక వాసు,ధర్మారావు, చిన్నారావు, సుధాకర్, ఉమ, సుమన్, జజోగిస్వరావు, హరిత, గ్రామ యువత మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జగ్గునాయుడుపేట గ్రామంలో పరిష్కారమైన కాలువ సమస్య

విశాలాంధ్ర -సీతానగరం: మండలంలోని జగ్గునాయుడుపేట గ్రామంలో గతఆరు నెలలుగా పరిష్కారంకాని కాలువ సమస్యను ఎంపీడీవో ఈశ్వరరావు చొరవ తీసుకొని కౌన్సిలింగ్ ఇవ్వడంతో బుధవారం సమస్య పరిష్కారమైనది. గ్రామంలోని ఒకవీధిలో కాలువకు అడ్డుగా గోడకట్టడంతో సమస్య జటిలమైంది. చాలాసార్లు సమస్యను పరిష్కారం చేయాలని ఫిర్యాదుదారులు కోరగా ఎట్టకేలకు మంగళవారంనాడు ఎంపీడీవో చొరవ తీసుకుని కాలువపై గోడకట్టేసిన మహిళను పిలిపించి కార్యాలయంలో రెండు గంటల పాటు కౌన్సిలింగ్ చేయగా బుధవారం ఆమె దాన్ని తీసి వేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, మహిళా పోలీస్ ఇంజనీరింగ్ సహాయకులు రజని, విజయశ్రీ, జయప్రభ లు పాల్గొన్నారు.

ఆటోల యజమానులకు, డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం



విశాలాంధ్ర సీతానగరం: ఇటీవల కాలంలో అనునిత్యం రోడ్డు ప్రమాదాల్లో ఆటోలు బోల్తాపడి పలువురు మృతిచెందడం,పలువురు క్షత గాత్రులు కావడంతో ఆటోల యజమానులకు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నట్లు మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ తెలిపారు. బుధవారం నాడు మండల కేంద్రంలోని హనుమాన్ గుడి వద్ద ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా రవాణా అధికారి శశి కుమార్ ఆదేశాల మేరకు అన్ని మండల కేంద్రాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎక్కువమంది ఆటో డ్రైవర్లు, యజమానులు కొత్తవారు కావడంతో ఎక్కువమంది ప్రయాణికులను తీసుకుని వెళ్లడం, ఇదేసమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనిని నివారించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అపరాదరసుము వసూలుతోపాటు కేసులు నమోదు చేయడం కంటే అవగాహన చేయడం వలన ప్రమాదాలు నివారించడానికి అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఆటోడ్రైవర్లు రోడ్డు నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, ఎక్కువమంది ప్రయాణికులను తీసుకుని వెళ్ళవద్దని సూచించారు. ఆయనతోపాటు పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం

ప్రమాణస్వీకారాన్ని వీక్షిస్తున్న అధికారులు, ఉద్యోగులు, నాయకులు, గ్రామస్తులు.

విశాలాంధ్ర-చింతపల్లి : స్థానిక వెలుగు కార్యాలయంలో తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, తన మంత్రి వర్గ ప్రమాణస్వీకారాన్ని వీక్షించేందుకు ఎంపీడీవో సాయిబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. బుధవారం చంద్రబాబునాయుడు నూతన ముఖ్యమంత్రిగా, తన మంత్రివర్గ సభ్యులతో ప్రమాణస్వీకార కార్యక్రమం వీక్షించేందుకు తెర ఏర్పాటు చేసారు. ప్రమాణస్వీకారాన్ని ఎంపీపీ అనూషాదేవి, ఎంఈవో ప్రసాద్, వెలుగు ఏపీవో నాయుడు, తెదేపా నాయకులు రీమల ఆనంద్, లక్ష్మణ్, ఎర్ర బొమ్మలు ఎంపీటీసీ సెగ్గే సత్తిబాబు, పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, గ్రామస్థులు తిలకించారు.

పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణుల సంబరాలు

విశాలాంధ్ర-సీలేరు : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు నాల్గో సారి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా జీకేవీధి మండలం దారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ పంచాయతీల్లో టీడీపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం టీడీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గన్నారు. అదే విధంగా సీలేరులో కూడా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు బొర్రా కృష్ణ, నక్కా తిరుమలరావు, ఎస్.కె.సుభాన్, మాజీ ఎంపిటిసి లూసి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రంపచోడవరం : నూతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం తిలకించేందుకు ప్రజా ప్రతినిధులు, అధికారులు సిబ్బంది తిలగించేందుకు రంపచోడవరం డివిజన్ కేంద్రంలో రెండు చోట్ల లైవ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేయడం జరిగిందని రంపచోడవరం ఎంపీడీవో హరికృష్ణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఎంపీడీవో హరికృష్ణ మాట్లాడుతూ ఈరోజు ఉదయం 11 గంటల 27 నిమిషాలకు నూతన ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు అదేవిధంగా మరి కొంతమంది గౌరవ నూతన మంత్రులు ప్రమాణస్వీకారము తిలకించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో అదేవిధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ఎల్ఈడి లైవ్ కాస్టింగ్ ద్వారా ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని తిలకించడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి తాగునీరు అదేవిధంగా అభిమానులు కేక్ కట్ చేసి వచ్చిన ప్రజలకు స్టేట్ బ్యాంకు సమీపంలో భోజన సౌకర్యం ఏర్పాటుచేయడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు వి.అనంత మోహన్, సిద్ధ వెంకన్న బాబు, బాపిరాజు, నిలపు సూరిబాబు, మోకా నాగేంద్ర వరప్రసాద్, పి. శ్రీనివాస్, వయసు సుభాష్ చంద్రబోస్, తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో దోమల నివారణమందు స్ప్రేయింగ్ పూర్తి

డిఎంఓ జగన్మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం : పాఠశాలలు పునఃప్రారంభం నాటికి వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ (స్ప్రేయింగ్) పూర్తి కావచ్చిందని జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి.జగన్‌మోహనరావు తెలిపారు. బుధవారం మలేరియా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా జిల్లాలో ఉన్న గిరిజన సంక్షేమ, సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో ఎసిఎం 5% దోమల మందు స్ప్రేయింగ్ చేయించడం జరిగిందని తద్వారా పాఠశాలలు ప్రారంభం నాటికి దోమల ప్రభావం తగ్గి విద్యార్థుల్లో సీజనల్ జ్వరాలు ప్రబలకుండా జాగ్రత్త పడవచ్చని అన్నారు. ఇప్పటికే మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారీ కొనసాగుచున్నదనీ, 287 గ్రామాల్లో పూర్తి కావచ్చిందని ఇంకా 114 గ్రామాల్లో జరగనున్నదని తెలిపారు. వసతి గృహాల పరిధిలో వైద్య సిబ్బంది వద్ద అవసరమైన జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు అందుబాటులో ఉంచాలని, పలు గ్రామాల నుండి హాస్టళ్లలో చేరబోయే విద్యార్థుల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది దృష్టి సారించాలన్నారు.

ఘనంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-గరుగుబిల్లి : మండల పరిధిలోని రావివలస గ్రామంలో శ్రీవీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ మహోత్స వములను బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అదే విధంగా శ్రీవీర బ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమాలు రుగడ విశ్వనాథం, బుక్కూరు గణేష్, కొండూరు సోమేశ్వరరావు, రుగడ సురేష్, తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా దాదాపు వెయ్యి మందికి పైబడి అన్నసమారాధన కార్యక్రమంను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదమును స్వీకరించారు. ఈకార్యక్రమంలో గుంట్రెడ్డి సత్యనారాయణ, గుంట్రెడ్డి సురేష్ కుమార్, గుంట్రెడ్డి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

వాహన చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా రవాణా శాఖ అధికారి శశికుమార్

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : వాహనదారులు చట్ట నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా రవాణా శాఖ అధికారి శశికుమార్ అన్నారు.బుధవారం వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ మధ్య కాలంలో ఆటో రిక్షాలలో అధిక ప్రయాణికులతో ప్రయాణిస్తూ రోడ్డు ప్రమాదాలకు గురౌతున్న నేపధ్యంలో రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు మరియు జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం, జిల్లా రవాణా శాఖ గత మూడు రోజులుగా అధిక ప్రయాణికులతో ప్రయాణిస్తున్న ఆటో రిక్షాలను ప్రత్యేక తనిఖీలను నిర్వహించి 37 ఆటో రిక్షాలపై కేసులు పెట్టి అపరాధ రుసుమును వసూలు చేయడమైనదని, వాహన పత్రాలు లేని కొన్ని ఆటో రిక్షాలను సీజ్ చేయుట జరిగిందని, అధిక ప్రయాణికులతో ప్రయాణం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం,ఫిట్ నెస్ సర్టిఫికేట్ లేకుండా వాహనములను నడపడంపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించడం జరిగినదని అన్నారు. ఈ జిల్లాలో గల 81 స్కూల్ మరియు కాలేజీ బస్సులలో నేటి వరకు 60 స్కూల్/కాలేజీ బస్సులకు వాహన సామర్థ్య పునరుద్ధరణ (రెన్యూవల్ ఆఫ్ ఫిట్ నెస్ సర్టిఫికెట్) చేయుట జరిగినదని,వాహన సామర్థ్య పునరుద్ధరణ చేసుకోని మిగిలిన 21 స్కూల్/కాలేజీ బస్సుల యాజమాన్యం వెంటనే వాహన సామర్థ్య పునరుద్ధరణ చేసుకోనవలసినదిగా కోరారు. లేనిచో ప్రత్యేక తనిఖీలలో పట్టుబడితే మోటార్ వాహన చట్టం ప్రకారం అట్టి వాహనమును సీజ్ చేసి అపరాధరుసుం విధించబడునని తెలిపారు.

శ్రీకనకదుర్గమ్మ దేవాలయ వార్షికోత్సవం

విశాలాంధ్ర-వి. ఆర్. పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని కుందులూరు పంచాయతీ కుందులూరు గ్రామంలో తిరుమల తిరుపతి ఆర్థిక సాయంతో శ్రీవాణి ట్రస్ట్ సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం మొదటి వార్షికోత్సవం దేవాలయ కమిటీ, గ్రామస్తులు మహిళా మాతృమూర్తులు సమరసత సేవ ఫౌండేషన్ మండల ధర్మ ప్రచారక్ ముత్యాల శ్రీరామ కృష్ణయ్య సమక్షంలో అమ్మవారి ఆలయ నిర్మాణ మొదటి వార్షికోత్సవం పురస్కరించుకొని శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి ఆలయంలో బుధవారం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో చింతూరు సబ్ డివిజన్ సహ కన్వీనర్ ఎర్ర నరసింహారావు గ్రామస్తులు భక్తజనులు పాల్గొన్నారు.

మొక్కలు తీర్చుకున్న జనసేన నాయకులు

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్ : జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేయడంతో పట్టణ జనసేన నాయకులు చందక అనిల్ ఆధ్వర్యంలో స్థానిక వినాయకుడి గుడి వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బెలగాం జయప్రకాష్ నారాయణ,బార్నాల సీతారాం.మజ్జి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా రాక్షస పాలనకు నేటితో తెర పడింది

పవన్ కళ్యాణ్ ప్రమాణ స్వీకారం సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న ఎన్డీఏ కూటమి నాయకులు
ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు బేతాళుడు, రమణ, రమేష్

విశాలాంధ్ర-చింతపల్లి : సార్వత్రిక ఎన్నికలలో శత శాతం స్ట్రైక్ రేట్ తో చరిత్ర సృష్టించి, ఎన్డీఏ కూటమిలో రాష్ట్ర మంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేసిన జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కు సంఘీభావంగా స్థానిక ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులతో కలిసి జనసైనికులు సంబరాలు జరుపుకున్నారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రమాణస్వీకారం అనంతరం ఆ పార్టీ జనసైనికులు కేక్ కట్ చేసి, బాణసంచా కాల్చారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుని సంబరాలు జరుపుకున్నారు. పవన్ కళ్యాణ్ నటించిన సినిమాల పాటలకు నృత్యాలు చేసి రంగులు జల్లుకున్నారు. కూటమి వర్థిల్లాలి, పవన్ కళ్యాణ్ నాయకత్వం వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్డీఏ కూటమి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనకు నేటితో తెర పడిందన్నారు. ప్రజా పరిపాలనకు బీజం పడిందన్నారు. కేంద్ర రాష్ట్రాలలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలు ఏర్పడడం శుభపరిణామం అని ఈ సందర్భంగా వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు పెదిరెడ్ల బేతాళుడు, తాటిపాకలు రమేష్, దూనబోయిన రమణ, హరి, శేఖర్, తరుణ్, చైతన్య, బబ్బు, అధిక సంఖ్యలో కూటమి పార్టీలకు చెందిన కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

చింతపల్లి : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు నాలుగవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారంతో రాష్ట్రంలో ప్రజా రంజక పరిపాలన ప్రారంభమైందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కిలో పూర్ణచంద్రరావు అన్నారు. ఆయన నాయకత్వంలో బుధవారం మండల కేంద్రంలోని పాత బస్టాండ్ కూడలిలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సార్వత్రిక ఎన్నికలలో ప్రభంజనం సృష్టించి నాలుగవసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కు సంఘీభావంగా మండలంలోని తెదేపా శ్రేణులతో భారీ కేట్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఒకరికొకరు కేక్, స్వీట్లు తినిపించుకుని సంతోషంతో చంద్రబా బునాయుడు నాయకత్వం వర్థిలాల్లి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గంలో తెదేపా విజయం సాధించకపోయినప్పటికీ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి రాజకీయ ప్రభంజనం సృష్టించింది అన్నారు. తెదేపా 135 స్థానాలతో సత్తా చాటిందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం తో ప్రజా పరిపాలనకు శ్రీకారం చుట్టినట్లు అయిందన్నారు. నేటి నుండి రాష్ట్రంలో సుపరిపాలన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ చింతపల్లి గ్రామకమిటీ అధ్యక్షుడు రీమల ఆనంద్, మండల ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, సీనియర్ నాయకుడు గొల్లోరి మంగు, పెదిరెడ్ల బేతాళుడు, బేతా నూకరత్నం, దూరి రామకృష్ణ, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు లక్కోజు నాగ భూషణం, బీజేపీ నాయకులు జయతి ప్రభాకర్, జనసేన నాయకులు లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

సీలేరు పీహెచ్‌సిని జిల్లా వైద్య ఆరోగ్య-శాఖాధికారి తనిఖీ

విశాలాంధ్ర-సీలేరు... జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.జమాల్ భాషా బుధవారం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం క్లినిక్, వార్డులను సందర్శించారు. అనంతరం మలేరియా కేసుల వివరాలను, స్ప్రేయింగ్ వివరాల వంటి అన్ని విభాగాలను గురించి వైద్యాధికారి డాక్టర్ కె.సౌమ్యను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా పటిష్ట మైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫీడర్ అంబులెన్స్ సేవలు గురించి తెలుసుకున్నారు. వాహనానికి కావలసిన ఆయిల్ చింతపల్లిలో ఉన్న ఇండియన్ అయిల్ బంక్‌లో ఇస్తున్నారు చింతపల్లి నుండి సీలేరుకి 70 కిలోమీటర్లు నుండి నుండి పెట్రోల్ తీసుకురావడం కష్టంగా ఉందని, స్థానికంగా ఉన్న ఆయిల్ బంక్‌లో పొందేలా ఆదేశాలు ఇప్పించమని ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ కోరారు. ఆయన వెంట ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్.జోజిబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు యస్.త్రినాథ్, స్టాఫ్ నర్స్ మాధురి, ఆరోగ్య కార్యకర్త సత్యనారాయ, ఫీడర్ అంబులెన్స్ డ్రైవర్ వెంకటేష్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.